క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



గోల్కొండలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన నానల్‌నగర్, టోలిచౌకీ, గోల్కొండ తదితర డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా గుంతల రోడ్లు, దెబ్బతిన్న మ్యాన్‌హోళ్లతో ఇబ్బందులు పడుతున్నామని ఆయా ప్రాంతాల వారు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత రోడ్ల మరమ్మతు పనులు ప్రారంభమైయ్యాయన్నారు. అదే విధంగా దెబ్బతిన్న డ్రైనేజీ లైన్‌లకు సైతం మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. మజ్లిస్ నాయకులు ఆరూన్‌ఫరాన్, బేగ్, ఆలీముద్దీన్, సయ్యద్ అజామ్ తదితరులున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న టోలిచౌకీ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: గోల్కొండ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం గోల్కొండ షాలీమార్ ఫంక్షన్‌హాల్‌లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టోలిచౌకీ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ పోలీసులు సైబర్ నేరాల నుంచి దూరంగా ఉంచడానికి స్టే సేఫ్ ఆన్‌లైన్ క్యాంపెన్ ప్రారంభించారని దీనికి మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చుకు చిక్కుకోకుండా స్టే సేఫ్ ఆన్‌లైన్ అత్యుత్తమమైనదన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు వీడియోలు, నిజంపై ఆధారపడిన వీడియో క్లిపింగ్స్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, పీస్ కమిటీ సభ్యులు అజామ్‌ఖాన్ తదితరులున్నారు.

'తెలంగాణలో కాంగ్రెస్‌కు తిరుగులేదు'



కాంగ్రెస్ నాయకులతో యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రోశిని జైస్వాల్

గోల్కొండ: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రోశిని జైస్వాల్ అన్నారు. సోమవారం ఆమె షేక్‌పేట్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నారన్నారు. మహిళల కోసం తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు అవుతున్నాయని ఆమె అన్నారు. యూత్ కాంగ్రెస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం అధ్యక్షుడు ఖాలేద్, షేక్‌పేట్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘునందన్, బాలకృష్ణ, సాయినాథ్, మురళీకృష్ణ తదితరులున్నారు.

ట్రాఫిక్ కష్టాలు.. ఇంకెన్నాళ్లు!



బండ్లగూడ నుంచి కిస్మత్‌పూర్ వెళ్లే రహదారిపై రద్దీగా వాహనాలు

శివారు ప్రాంతంలో ఇరుకుగా రహదారులు

- భారీగా పెరిగిన వాహనాల రాకపోకలు
- అటకెక్కుతున్న రోడ్డు విస్తరణ పనులు
- టెండర్లు పూర్తయినా కొందరి నిర్లక్ష్యం కారణంగానే...
- దారికి రాని పనులతో ప్రజలకు తప్పని ఇబ్బందులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ శరవేగంగా విస్తరిస్తున్నది. హైదరాబాద్ నగర శివారు ప్రాంతాలలో అత్యంత డిమాండ్ ఉన్న సంపన్న ప్రాంతాల్లో ఒకటనే విషయం నిర్వివాదాంశం. నిత్యం రద్దీతోపాటు ట్రాఫిక్ సమస్యలూ అదే స్థాయిలో పెరిగిపోయాయి. ఎంతలా పెరిగాయంటే పరిస్థితులు అత్యంత ప్రమాదకరంగా మారే విధంగా ఉన్నాయంటూ స్థానికులు, వాహనదారులు, పాదచారులు పేర్కొంటున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న వ్యక్తిగత వాహనాల కారణంగా ఈ ప్రాంతంలో ట్రాఫిక్ కష్టాలు పెరిగిపోతున్నాయి. రోడ్డుమీదకు రావాలంటే వాహనదారులు ప్రాణాలరచేతిలో పెట్టుకొని రావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయంటే ప్రమాదాల తీవ్రత ఎంతలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. గతంలోనే కార్పొరేషన్ పరిధి 100 ఫీట్‌ల రోడ్డుల విస్తరణకు ఏర్పాట్లు పూర్తి అయినా నేటికీ రోడ్డు పనులు జరగకపోవడంతో ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు మాత్రం తీరడంలేదు.

కార్పొరేషన్ పరిధిలో రోజురోజుకు అంచనాలకు మించి పెరుగుతున్న వెహికిల్ లోడ్, ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా రహదారులను విస్తరించాల్సి ఉంది. కానీ రోడ్డు విస్తరణ పనులు చేపట్టకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఇరుకుగా ఉన్న ఈ దారి గుండా నిత్యం వేలాది వాహనాలు వెళ్తుండటంతో బండ్లగూడ ముఖ్య కూడలి నుంచి నలువైపులా వెళ్లే భారీ వాహనాలు, బస్సులు, లారీలు ఇతర పెద్ద వాహనాలు మలుపు తిప్పడం కష్టంగా మారిందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు రహదారులు గుంతలు పడి, వాహనాలపై దుమ్ము, ధూళి పేరుకుపోయి ప్రయాణికులకు ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు త్వరలో రోడ్డు వెడల్పు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయినా...

కిస్మత్‌పూర్ నుంచి బండ్లగూడ చౌరస్తా జాతీయ రహదారి వరకు, ఎక్సైజ్ అకాడమీ నుంచి కిస్మత్‌పూర్ వరకు, దర్గా ఖలీజ్ ఖాన్ నుంచి కిస్మత్‌పూర్ వరకు 100 ఫీట్ల మేర లింక్ రోడ్లను నిర్మించేందుకు హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు వచ్చాయి. టెండర్ల ప్రక్రియ సైతం పూర్తి అయ్యింది. అధికారులు రోడ్డు విస్తరణకు గతంలోనే రోడ్డుకు ఇరువైపులా ఎంతవరకు విస్తరించేది మార్కింగ్ పనులు కూడా పూర్తి చేశారు. అయితే ల్యాండ్ అక్విజేషన్ చేయవలసిన అధికారులు నిర్లక్ష్యం చేయడంతోనే నిర్మాణంలో ఆలస్యం జరుగుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలు, పెద్దపెద్ద అపార్ట్‌మెంట్‌లు...

కాలానికి అనుగుణంగా ఇక్కడి ప్రాంతం ఒకప్పటి పరిస్థితుల్లో గణనీయమైన మార్పులొచ్చాయి. రహదారులు కొంతమేర అందుబాటులోకి వచ్చినా రోడ్డెక్కామంటే ఇబ్బందికరమైన పరిస్థితులున్నాయి. కిస్మత్‌పూర్, హైదర్షాకోట్, దర్గా ఖలీజ్ ఖాన్, గంధంగూడ, బండ్లగూడ, బైరాగిగూడ, పీరంచెరువు, హిమాయత్‌సాగర్ తదితర ప్రాంతాల్లో గృహ సముదాయాలు,పెద్దపెద్ద విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీ అపార్టుమెంట్‌లు భారీగా వెలిశాయి. కార్పొరేషన్ పరిధిలో సుమారుగా 200 కాలనీలు ఏర్పడగా, 38,800 కుపైగా నివాసగృహాలు ఉన్నాయి. 1.80 లక్షల మంది జనాలు నివాసముంటున్నట్టు అంచనా.

నిత్యం రద్దీగా ఉంటున్నా...

నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రోడ్డు ఇస్తరణ పనులు జరగకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. 100 ఫీట్ల రోడ్డు కలగానే మిగిలిపోవడంతో ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడా అని జనాలు ఎదురు చూస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు త్వరలో రోడ్డు వెడల్పు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



బండ్లగూడ ముఖ్యకూడలి వద్ద వాహనాల రద్దీ



ఇరుకు రోడ్డులో ఇబ్బందికరంగా వాహనాలు

ప్రజా సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం

- మాజీ మంత్రి సబితారెడ్డి



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో మాజీ మంత్రి సబితారెడ్డి, కార్తీక్‌రెడ్డి

మణికొండ: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమని, ఆ పార్టీకి అండగా నిలిచి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ మైనార్టీ విభాగం ఇంచార్జి షేక్ ముక్తార్ పాషా ఆధ్వర్యంలో సబితారెడ్డి సమక్షంలో వంద మందికిపైగా ఎంఐఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ పాలనలో మైనార్టీ విద్యా సంస్థలు, రేషన్ కార్డులు, షాదీముబారక్ లాంటి ఎన్నో పథకాలను అమలు చేయటంతో లక్షలాది మంది లబ్ధిపొందారన్నారు. మైనార్టీలకు బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర హోంమంత్రి పదవిని ఇచ్చిందని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లోనూ వారికి అన్ని రంగాలలో పెద్ద పీట వేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.కార్తీక్ రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు ముత్యాలు, గణేష్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సంతోష్, చిరంజీవి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో స్థానిక నేతలు మహ్మద్ హాజీక్, మహ్మద్ ఖాజాపాషా, అనీసాబేగం, నాజర్ ఖాన్, ఖయ్యూమ్, సమద్ ఖాన్, అమీర్‌ఖాన్, ఫరీదాబేగం, సల్మాబేగం, షమీమ్‌బేగం తదితరులు ఉన్నారు.

స్కేటింగ్ పోటీల విజేతలకు సర్టిఫికెట్ల ప్రదానం



విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న నాగేంద్రప్రసాద్ తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విద్యా భారతి దక్షిణ మధ్యక్షేత్ర జోనల్ లెవల్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలను శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో శ్రీ విద్యారణ్య ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు డిసెంబర్ 25 నుంచి 27వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ భారత రాయబారి టి.వి.నాగేంద్రప్రసాద్ గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సి.హెచ్.ఉమామహేశ్వర్‌రావు, పసర్తి, మల్లయ్య, కేఆర్‌కే సత్యనారాయణ, ఎన్‌వీకే విశ్వేశ్వర్‌రావు, భీమ్‌సేన తదితరులు పాల్గొన్నారు.

భవానీకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని భవానీ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జయరాజ్, ఉపాధ్యక్షుడిగా మహేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, జాయింట్ సెక్రటరీగా కిరణ్ బుద్దే, కోశాధికారిగా పవన్‌కుమార్, ఉమెన్ రెప్రజెంటేటివ్‌గా మంగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రక్రియను మధుసూదన్, రాజు, గౌరీశంకర్, పుల్లయ్య, రాజశేఖర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రతినిధులు, కాలనీ వాసులు కలిసి నూతన కార్యవర్గం సభ్యులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. భవానీ కాలనీ అభివృద్ధి, శుభ్రత, భద్రత, నివాసుల సంక్షేమం కోసం సమష్టిగా కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు స్పష్టం చేశారు.



నూతన కార్యవర్గ సభ్యులు

మల్లికార్జుననగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడ శ్రీ మల్లికార్జుననగర్ అసోసియేషన్ సభ్యుల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నికల అధికారి జి.ఆంజనేయులు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ అడికే మహేందర్, ఉపాధ్యక్షులుగా మనోహర్‌యాదవ్, కె.జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా ఠాగూర్ మహేందర్‌సింగ్, కార్యదర్శిగా అడికే భరత్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా సోమ శేఖర్‌పాటిల్, కోశాధికారిగా అంబదాస్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కిషోర్‌సింగ్, ఠాకూర్ ప్రేమ్‌రాజ్, సలహాదారులుగా ఎంపీ మహేందర్, శరణప్ప, శీలం గోవర్ధన్, ఆదిత్య, రవీందర్, ఎలిశెట్టి రామకృష్ణ, యాదయ్య ముదిరాజ్ ఎంపికయ్యారు. మూడు సంవత్సరాల పాటు కార్యవర్గం కొనసాగుతుందని ఎన్నికల అధికారి ప్రకటించారు.



నియామకపత్రం అందుకుంటున్న మహేందర్

క్రీడలు జీవన విధానంలో భాగం కావాలి

- తైక్వాండో చీఫ్ గ్రాండ్ మాస్టర్ జయంత్‌రెడ్డి



గెలుపొందిన క్రీడాకారులు

మణికొండ: ప్రతి ఒక్కరికీ క్రీడలు ఎంతో అవసరమని, వాటిని జీవన విధానంలో భాగం చేసుకుంటే పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండటంతో పాటు మానసికంగా ఎంతో ఉల్లాసంగా జీవించవచ్చని తైక్వాండో చీఫ్ గ్రాండ్ మాస్టర్ జయంత్‌రెడ్డి అన్నారు. మణికొండకు చెందిన సోమాస్ ఫిట్ తైక్వాండో చాంపియన్ షిప్–2025 పోటీలు స్థానిక సుందర్ గార్డన్స్‌లో ఆదివారం జరిగాయి. రాత్రి జరిగిన బహుమతుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... తైక్వాండో అంతర్జాతీయ క్రీడ అని దీని వలన పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరగటంతో పాటు శారీరక, మానసిక దృఢత్వం నెలకొంటుందన్నారు. ప్రస్తుత పరిస్థితిలో ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు ఇలాంటి క్రీడలను నేర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. క్రీడలనే కెరీర్‌గా మలుచుకోవటం, ఉద్యోగాలు సాధించటం ఎంతో మంది చేస్తున్నారన్నారు. ఆత్మరక్షణకు తైక్వాండో ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులకు ఆయన మెమొంటోలు, మెడల్‌లను అందించారు. సోమాస్ ఫిట్ వ్యవస్థాపకులు విజయ్‌కుమార్, కోచ్‌లు రాజు, విశాల్, జైరామ్‌లు, అతిథులుగా సురేష మలిక్, మొయిన్, హనుమంతు తదితరులతో పాటు వందలాది మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

'బ్రెయిన్ వేవ్'తో విద్యార్థుల ప్రతిభకు పదును

అత్తాపూర్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు అత్తాపూర్‌లోని శ్రీ మేధా జూనియర్ కాలేజీలో సోమవారం బ్రెయిన్ వేవ్–2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న కళాశాల చైర్మన్ నాగ అయ్యన్నబాబు, ప్రిన్సిపాల్ సుజాత వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కామర్స్, సైన్స్ విభాగాల్లో విద్యార్థులకు అన్ని విషయాల పట్ల అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. బ్రెయిన్ వేవ్ కార్యక్రమం వల్ల విద్యార్థుల్లో టీమ్ వర్క్, మెరుగైన పని విధానం అలవడుతాయన్నారు. విద్యార్థులు రూపొందించిన వివిధ విభాగాల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు.



వేడుకలను ప్రారంభిస్తున్న చైర్మన్ అయ్యన్నబాబు

విద్యార్థుల మృతదేహాల వెలికితీత

- పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగింత
- స్థానిక శ్మశానవాటికలో అంత్యక్రియల నిర్వహణ

రాజేంద్రనగర్: మొండి కత్వ వద్ద ఉన్న జలపాతంలో ఈత కొట్టేందుకు దిగి ప్రమాదవశాత్తు నీట మునిగి మరణించిన ఇద్దరు విద్యార్థుల మృతదేహాలను ఆదివారం రాత్రి వెలికి తీశారు. ఆయా మృతదేహాలకు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... సులేమాన్‌నగర్ ఎం.ఎం. పహాడీకి చెందిన మహ్మద్ రెహాన్(16), సోహేల్(15)లతో పాటు మరో నలుగురు ఆదివారం మధ్యాహ్నం మొండి కత్వ వద్ద ఉన్న జలపాతం వద్దకు వెళ్లారు. ఇందులోని రెహాన్, సోహేల్‌లు ఈత కొట్టేందుకు దిగి ప్రమాదవశాత్తు నీట మునిగి మరణించిన విషయం తెలిసిందే. వారి మృతదేహాలను ఆదివారం రాత్రి వెలికి తీసి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో సోమవారం స్థానికంగా ఉన్న శ్మశాన వాటికలో వారి మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రమాదకర గుంతకు మరమ్మతు చేయరూ...



రాజేంద్రనగర్: ప్రధాన రహదారి పక్కనే ఏర్పడిన డ్రైనేజీ గుంత ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై పెద్ద గొయ్యి ఏర్పడటంతో వాహనదారులు, స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. బుద్వేల్ ప్రధాన రహదారి పెట్రోల్ పంపు సమీపంలో రోడ్డు పక్కన భారీ గొయ్యి ఏర్పడింది. రెండు, మూడు నెలలుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు ఈ ప్రాంతంలో వచ్చి నిలిచిపోతుంది. స్థానికులు వరద నీరు వెళ్లేందుకు ఈ ప్రాంతంలో డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను ధ్వంసం చేయడంతో ఈ గొయ్యి ఏర్పడింది. వరదనీరు వెళ్లిన ప్రతిసారి ఈ గొయ్యి కాస్తా పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం ఈ గొయ్యి ప్రమాదభరితంగా మారింది. ఎలాంటి ప్రమాదం జరగకముందే గొయ్యికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఎయిర్‌పోర్టులో మాక్ డ్రిల్ నేడు

- బెదిరింపుల నేపథ్యంలో అన్ని విభాగాలతో సమన్వయం
- భద్రతే లక్ష్యంగా ఏర్పాట్లు చేసిన అధికారులు

శంషాబాద్: విమానాశ్రయ భద్రతే లక్ష్యంగా ప్రభుత్వంలోని వివిధ విభాగాల ద్వారా నిర్వహించే మాక్ డ్రిల్‌ను శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మంగళవారం నిర్వహించనున్నారు. బాంబు బెదిరింపుల ద్వారా తీసుకోవాల్సిన అప్రమత్తపై ఆయా ఏజేన్సీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ చేపడతారు. మాక్ డ్రిల్‌కు ఎయిర్‌పోర్టుకు ఎయిర్‌పోర్టులోని కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలతో పాటు జీఎంఆర్ సంస్థకు సంబంధించిన రక్ష సెక్యూరిటీ విభాగం, సైబరాబాద్ పోలీసులు స్పెషల్ ప్రొటెక్షన్ పోలీసులు, వైద్య, రెవిన్యూ సిబ్బందికి సన్నద్ధం అయ్యేందుకు లేఖలు జారీ చేశారు.

విమానాశ్రయం పరిసరాలో పర్యావరణ, పారిశుద్ధ్యంపై తరచూ జరిగే సమావేశాలకు సంబంధించిన ఆహ్వాన లేఖలను జీఎంఆర్ విమానాశ్రయం అధికారులు సోమవారం విడుదల చేశారు. ఇటీవల విమానాశ్రయంలో విమానాలకు తరచూ విహంగాలు తగులుతున్న కారణానికి సమీపంలో అపరిశుభ్రత, కోళ్ల వ్యర్థాలు కూడా ఓ కారణమైన ఉండవచ్చనే అంశంపై ఉన్నతాధికారులు చర్చించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. హమీదుల్లానగర్‌లో ఓ వ్యక్తి నిర్వహిస్తున్న కోళ్లఫాంపై ఇప్పటికే ఎయిర్‌పోర్టు అధికారులు నాలుగైదుసార్లు శంషాబాద్ మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

మహిళా పారిశుద్ధ్య కార్మికులపై వేధింపులు మానుకోవాలి



డీసీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న కృష్ణానాయక్

చాంద్రాయణగుట్ట: జీహెచ్‌ఎంసీ మహిళా పారిశుద్ధ్య కార్మికులను వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణా నాయక్ కోరారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ చాంద్రాయణగుట్ట సర్కిల్ ఉప కమిషనర్ సురేందర్‌రెడ్డిని సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కొందరు సూపర్‌వైజర్లు మహిళలని చూడకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రధాన రహదారులపై ప్రమాదకరంగా పనులు చేయిస్తుండడంతో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. కార్మికులు కమిలీ, దర్శి, సోనా, సంగీత, కృష్ణ, లక్ష్మీ, శాంతి తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ మహంకాళి ఆలయ ఆవరణలో ఈ నెల 23 నుంచి సర్వమంగళా దేవి సమేత శ్రీ మరకత మహా మంగళేశ్వర పంచాయతన పరివార దేవతా, బొడ్రాయి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు జె.మధుసూదన్‌గౌడ్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆలయంలో సోమవారం ఆలయ అర్చకులు వేదాంతం రాజ నర్సింహాచార్యులు, పవన్ కుమార్ ఆచార్యుల చేతుల మీదుగా పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవాల వాల్ పోస్టర్‌ను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. 23న ఉప్పుగూడ పొలిమేరలో దేవతా మూర్తుల ఊరేగింపు, బలిహరణ, 24న అఖండ దీప స్థాపన, అంకురారోపణ, ప్రధాన కలశ స్థాపన, 25న యంత్ర విగ్రహములకు నవవిధ ద్రవ్య మహా జలాభిషేకం, స్థాపత దేవతార్చనలు ఉంటాయన్నారు. 26న ఉదయం 11.27 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ కళాన్యాసనం, బొడ్రాయికి ఆడపడుచుల నీటితో అభిషేకం చేయడం, 27న గ్రామస్థులు వారి వారి గృహాల్లో ఒడిబియ్యం సమర్పణ చేసుకోవాలని, సాయంత్రం 6 గంటలకు శివపార్వతుల శాంతి కల్యాణ మహోత్సవం జరుపబడుతుందని తెలిపారు. 28న బొడ్రాయి పండుగ, గ్రామస్థులంతా నివాసాల నుంచి బోనాలు సమర్పించే కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కమిటీ కోశాధికారి సుభాష్, కార్యదర్శులు సతీష్, శ్రీనివాస్, గురునాథ్, హరికృష్ణ, భవానీశంకర్, వేణు, సాయి, కిరణ్ పాల్గొన్నారు.



ఉత్సవాల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు